ప్రభుత్వ వైఖరి అనైతికం



జవహర్‌నగర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

జవహర్‌నగర్‌: అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని కాంగ్రెస్‌ ప్రభుత్వ సస్పెండ్‌ చేయడం దారుణమని మాజీ మేయర్‌ మేకల కావ్య అన్నారు. బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఆదేశాల మేరకు మాజీ మేయర్‌ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ ప్రధాన చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం చేస్తున్న అవినీతిపై అసెంబ్లీలో నిలదీస్తున్నందునే జగదీష్‌రెడ్డిని సస్పెండ్‌ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మేక లలిత యాదవ్‌, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భార్గవ్‌రామ్‌, సుధాకర్‌చారి, ప్రసాద్‌గౌడ్‌, అహ్మద్‌ పాషా, కృష్ణయాదవ్‌, సాదిక్‌, బాలస్వామి, నర్సింహ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మేడ్చల్‌: అసెంబ్లీలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌ నిరసిస్తూ శుక్రవారం మేడ్చల్‌లో బీఆర్‌ఎస్‌ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక వివేకానంద విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించిన నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ నాయకులను అరెస్ట్‌ చేసి ఠాణాకు తరలించిన పోలీసులు సాయంత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌యాదవ్‌, , రాజమల్లారెడ్డి, దయానంద్‌యాదవ్‌, సుదర్శన్‌, విషునచారి, శ్రీనివాస్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శైలేందర్‌, రామకృష్ణరాజు, శంకర్‌, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్‌: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌-వరంగల్‌ జాతీయ రహదారిపై ఎన్‌ఎఫ్‌సీ నగర్‌ రైల్వే వంతెనపై వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని హైదరాబాద్‌ వైపు నుంచి భువనగిరి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఘట్‌కేసర్‌లో సమాచారం అందించాలని సూచించారు.

ముగిసిన రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

మేడ్చల్‌: మేడ్చల్‌ రామలింగేశ్వర ఆలయంలో 11 రోజులుగా కొనసాగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం హోలీ పండగ సందర్భంగా ఆలయంలో వర పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారికి వసంతోల్సవం నిర్వహించారు. పల్లకీ పై స్వామి వారిని పట్టణ వీధుల్లో ఊరేగించి రంగులు చల్లుకుని హోలీ పండగను నిర్వహించారు.

మాజీ మంత్రి సస్పెన్షన్‌పై బీఆర్‌ఎస్‌ నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌ నేతలు

ఘట్‌కేసర్‌: మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్‌ చేసినందుకు బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘట్‌కేసర్‌లో బీఆర్‌ఎస్‌ నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, రమేశ్‌, కొండల్‌రెడ్డి, రవి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హోలీ ఆడుతున్న మాజీమంత్రి మల్లారెడ్డి



మేడ్చల్‌లో కాముడి దహనం



ఘట్‌కేసర్‌లో..



హోలీ.. ఆనందాల కేళి

మేడ్చల్‌ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి పలు కాలనీలు, వీధుల్లో కాముడి దహనం చేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా కేరింతలు కొట్టారు. పలువురు రాజకీయ నాయకులకు, స్నేహితులు, బంధువులకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

–మేడ్చల్‌ జోన్‌ బృందం





గుండ్లపోచంపల్లిలో..



అవుషాపూర్‌లో..



అన్నోజిగూడలో ..



చీర్యాలలో..



నాగారంలో..



మేడ్చల్‌లో..

యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి



ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో పోలీస్‌, మీడియా టీం సభ్యులు

మేడ్చల్‌రూరల్‌: యువత బెట్టింగ్లు, ఆన్‌లైన్‌ గేమ్స్‌ వంటి వాటికి దూరంగా ఉండాలని మేడ్చల్‌ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మేడ్చల్‌ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్‌ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆన్‌లైన్‌ గేమ్స్‌ ఆడి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలు తీసుకుంటూ కుటుంబాలకు శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. బెట్టింగులకు పాల్పడవద్దని ,ఆన్‌లైన్‌ గేమ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. శరీర దారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని యువత క్రీడా రంగంలో రాణించాలని ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ అన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా క్రికెట్‌ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నీలో 48 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. టోర్నీ ప్రారంభం అనంతరం మొదటి మ్యాచ్‌ మేడ్చల్‌ పోలీసులు– మీడియా సభ్యుల మధ్య సాగింది. మొదట బ్యాటింగ్‌ చేసిన పోలీస్‌ టీం నిర్ణీత 7 ఓవర్లలో 69 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలో దిగిన మీడియా టీం 7 ఓవర్లలో 67 పరుగులు చేయడంతో 2 పరుగుల తేడాతో పోలీస్‌ టీం విజయం సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్‌ఐ, మీడియా సభ్యుడు రాజశేఖర్‌కు ఏసీపీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌ క్లబ్‌ అధ్యక్షులు హరినాథ్‌, నియోజకవర్గ ఉపాధ్యక్షులు మురళీధర్‌, బారీ, మల్లారెడ్డి, లక్ష్మణ్‌యాదవ్‌, ఎలక్ట్రానిక్‌ మీడియా అధ్యక్షులు మహేశ్‌, పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

ముగిసిన కురుక్షేత్ర–25 క్రీడా పోటీలు

ఘట్‌కేసర్‌: ఘనాపూర్‌ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల (కేపీఆర్‌ఐటీ)లో కొనసాగుతున్న ''కురుక్షేత్ర– 25'' జాతీయ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ క్రీడా మండలి కార్యదర్శి, జేఎన్టీయూహెచ్‌ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ హెడ్‌ దిలీప్‌ కబడ్డీ, క్రికెట్‌, త్రోబాల్‌, వాలీబాల్‌ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేపీఆర్‌ఐటీ చైర్మన్‌ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్‌ చైర్మన్‌ ప్రశాంత్‌, డైరెక్టర్‌ సుధీర్‌ప్రేమ్‌ కుమార్‌, ప్రిన్సిపాల్‌ రవీంద్ర ఏక్లార్కర్‌, శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్‌ డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు, క్రీడాకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



రమణీయం సత్యదేవుని కల్యాణం



రామంతాపూర్‌ : శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి 52వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణం వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య వేలాది భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, ఆలయ ఈఓ విజయ భారతి, ఫౌండర్‌ ట్రస్ట్‌ మెంబర్‌ కోట్ల నర్సింహారెడ్డి, ప్రధాన అర్చకులు తిరుపతి ఆచార్య, శేషాచార్య సీతారామాచార్య, ఆలయ సిబ్బంది శంకర్‌తో పాటు అభివృద్ధి కమిటీ మెంబర్లు పూస సత్తయ్య, జగదీష్‌కుమార్‌, విజయభాస్కర్‌, బాబురావు, అశోక్‌, అంబిక తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాన సరస్వతీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ జ్ఞానసరస్వతీ అమ్మవారి దేవాలయం 21 వ వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే బ్రహోత్సవాల్లో భాగంగా గణపతిపూజ, పుణ్య హవచనము, ధ్వజారోహణం, మండపారాధన, గణపతి హోమం, సాయత్రం సహస్ర కుంకుమార్చన, రాత్రి పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్‌ హరీష్‌, ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.



ప్రభుత్వ వైఖరి అప్రజాస్వామికం

కుషాయిగూడ: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్‌ సస్పెండ్‌ చేయడం అప్రజాస్వామికమని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్‌ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీలో జగదీష్‌రెడ్డి వాఖ్యలను వక్రీకరిస్తూ సస్పెండ్‌ చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. ఏడాది కాలంలోనే కాంగ్రెస్‌ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల తిరస్కరణకు గురైందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్‌ చేశారు. ఈసీఐఎల్‌ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులను పోలీసులు చెదరగొట్టే క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. ఉప్పల్‌ ఎమ్మెల్యేతో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభుదాస్‌, పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, బద్రోద్దీన్‌, నేమూరి మహేష్‌గౌడ్‌ , కనకరాజుగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



ఈసీఐఎల్‌ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు..

బీమా.. మహిళలకు ధీమా

- మహిళా శక్తి పేరిట మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలు
- ఉచిత రుణ బీమా...ప్రమాద బీమాతో ఆర్థిక సాయం
- 18 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు మాత్రమే
- ఈ పథకాలతో జీపీ, పురపాలికల్లోని 1.09 లక్షల మంది సభ్యులకు ప్రయోజనం



సాక్షి,సిటీబ్యూరో: మహిళా శక్తి పేరుతో ప్రత్యేక రుణాలు అందించడానికి చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. అతివల కోసం రెండు రకాల బీమా పథకాలను అమల్లోకి తెచ్చింది. ఉచితంగా రుణ బీమాతో పాటు ప్రమాద బీమా కల్పిస్తోంది. పొదుపు సంఘంలో రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థిక సాయం అందనుంది. ఈ బీమాతో గ్రామ పంచాయతీలతో పాటు పురపాలక సంఘాల్లోని పొదుపు సంఘాల మహిళా సభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఈ రెండు రకాల బీమా పథకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి.

1.09 లక్షల మహిళా సభ్యులకు వర్తింపు..

- మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని రూరల్‌ ప్రాంతాల్లో 13 పురపాలక సంఘాలు ఉండగా, ఐదు మండలాల పరిధిలో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్‌డీఏ, మెప్మా అధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పని చేస్తుండగా, ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వం అమలు పరచనున్న ఈ రెండు బీమాలు ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి. ఇదిలా ఉండగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)అధ్వర్యంలో ఐదు మండలాలకు సంబంధించి ఒక జిల్లా సమాఖ్య, ఐదు మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా, వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు. మెప్మా అధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్‌ లెవల్‌ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్‌ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. ఆయా సంఘాల్లో 72,450 మంది సభ్యులు ఉన్నారు.
- ఈ సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి, చిరువ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళా శక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలను ప్రభుత్వం అందజేస్తోంది.

ప్రమాద బీమా రూ.10 లక్షలు

స్వయం స్వహాయక (పొదుపు)మహిళా సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మృతి చెందితే .. వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఉచిత బీమా వర్తింపజేయనున్నారు. ఒకవేళ వందశాతం వైకల్యం కలిగినా రూ.10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యానికి గురైతే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళకు పొదుపు అప్పు ఉంటే అది పూర్తిగా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యాన్ని నిర్ధారించే సదరం ధృవపత్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల పరిశోధన నివేదిక ఇవ్వాల్సి ఉంటోంది. 18 నుంచి 60 ఏళ్ల లోపు పొదుపు మహిళలకు మాత్రమే ఈ పథకాలు వర్తిస్తాయి.

క్షేత్ర స్థాయిలో అవగాహన కరువు..

బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపులు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్‌ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. ఇలాంటి వాటిపై మహిళల్లో పూర్తిస్థాయిలో అవగాహన లేదు. పలు గ్రూపులు నెలవారీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదు. దీనిపై సెర్ప్‌, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

మహిళలకు అండ..

మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి రెండురకాల బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంతో సభ్యుల కుటుంబాలకు, రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. దీనిపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా చర్యలను సంబంధిత శాఖలు చేపట్టాల్సి ఉంది.